పల్లెల్లో అటకెక్కిన ఫాగింగ్

రానున్నది సీజనల్ వ్యాధుల కాలం. దానికి తోడు పల్లెల్లో పారిశుద్ధ్యం లోపిస్తే ఇంకేమైనా ఉందా? తలుచుకుంటేనే సగటు మనిషికి భయం వేస్తుంది. వర్షాకాలం వస్తుందంటే ముందుగా పల్లెలు, పట్టణాల్లో దోమల నివారణకు ప్రాధాన్యత ఇస్తూ చేపట్టే ప్రక్రియ ఫాగింగ్. కానీ.. నిర్వహణ లేక, యంత్రాలు మూలనపడడంతో పల్లెల్లో దోమల బెడద అధికమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- నిరుపయోగంగా మారిన యంత్రాలు
- దోమల బెడదతో ప్రజల ఇబ్బందులు
- నిధుల లేమితో కొరవడిన నిర్వహణ!



పరిగి మండల కేంద్రంలో ఫాగింగ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి(ఫైల్)

పరిగి: దోమల నివారణ కోసం కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రాలు అటకెక్కాయి. గ్రామాల్లో దోమల నియంత్రణ, నివారణకు ప్రభుత్వం గతంలో పంచాయతీలకు సొంత నిధులతో ఫాగింగ్ యంత్రాలను సమకూర్చుకునేందుకు అవకాశం కల్పించింది. అయితే నిర్వహణకు నిధుల కొరత, మరమ్మతులకు సాంకేతిక సిబ్బంది అందుబాటులో లేకపోవడం తదితర కారణాలతో చాలా జీపీల్లో యంత్రాలు నిరుపయోగంగా మారాయి. ఫలితంగా గ్రామాల్లో దోమలు స్వైరవిహారం చేస్తూ.. ప్రజలను నిద్రకు దూరం చేస్తున్నాయి.

98 గ్రామాల్లో యంత్రాలు..

కరోనా అనంతరం ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంది. మురుగు కాలువల్లో, నీరు నిల్వప్రదేశాల్లో దోమల సంతానోత్పత్తిని అరికట్టేందుకు పొగ రూపంలో వాటిని నియంత్రించేందుకు ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేయించింది. నియోజకవర్గంలో నాలుగు మండలాలు పరిగి, దోమ, కుల్కచర్ల, పూడూర్ మండాల్లో మొత్తం 148 గ్రామ పంచాయతీలు ఉండగా.. అందులో సుమారు 98 జీపీల్లో ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేశారు. పంచాయతీ నిధులతో ఒక్కో యంత్రానికి సుమారు రూ.50వేల వరకు వెచ్చించి కొనుగోలు చేశారు. పెట్రోల్, డీజిల్‌ను వినియోగించి దోమల నివారణకు పారిశుద్ధ్య సిబ్బంది ఫాగింగ్ చేసేవారు. గ్రామం మొత్తం ఫాగింగ్ చేసిన ప్రతి సారి రూ.5వేల వరకు ఖర్చు అవుతుంది. కొంతకాలం వరకు బాగానే పని చేసిన యంత్రాలు, తర్వాత మొరాయించాయి. మరమ్మతులకు వేల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. నిధుల లేమితో మరమ్మతులు చేయించలేక పోవడంతో యంత్రాలు మూలనపడ్డాయి.

నిధుల కొరత

జీపీల్లో నిధుల కొరత సమస్య వెంటాడుతోంది. బిల్లుల చెల్లింపు ప్రక్రియ తరచూ నిలిచిపోవడంతో పాలకులు, అధికారులు, ఫాగింగ్ యంత్రాల మరమ్మతులపై దృష్టి సారించడం లేదు. ఒక్కోసారి పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొందని, ఆ కారణంగానే ఈ ఫాగింగ్ యంత్రాలకు మరమ్మతులు చేయించలేకపోతున్నామని స్థానిక ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



దోమల నివారణ కోసం కొన్ని గ్రామ పంచాయతీల్లో అక్కడి నిధులతోనే ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేశారు. యంత్రాల మరమ్మతు కారణంగా కొన్ని పల్లెల్లో మూలనపడ్డాయి. నిరుపయోగంగా ఉన్న వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– శేషగిరిశర్మ, ఎంపీడీఓ పరిగి

నేడు పాలకవర్గం ప్రమాణ స్వీకారం

బషీరాబాద్: బషీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేయనుంది. స్థానిక రైతువేదికలో ఉదయం 10.30 గంటలకు జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి హాజరు కానున్నారని వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు తెలిపారు. చైర్‌పర్సన్‌గా వాల్యానాయక్‌తండాకు చెందిన శాంతిబాయి, వైస్ చైర్మన్‌గా కృష్ణతో పాటు సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

సీఎంఆర్ పేదలకు వరం

దౌల్తాబాద్: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 7మంది లబ్ధిదారులకు మంగళవారం ఆయన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. పేదలు అనారోగ్యానికి గురైతే.. ఆసుపత్రి ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ సుజాతరెడ్డి, ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్పీడ్ బ్రేకర్ తొలగింపు



స్పీడ్ బ్రేకర్ తొలగించిన ప్రదేశం

దోమ: గొడుగోనిపల్లి గ్రామం పరిగి–మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై ఉన్న ప్రమాదకరమైన స్పీడ్ బ్రేకర్‌ను అధికారులు మంగళవారం తొలగించారు. సోమవారం 'సాక్షి'లో 'స్పీడ్ బ్రేకర్‌తో బైక్ అదుపుతప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు' అనే శీర్షికతో ప్రచురించిన వార్తా కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. సర్పంచ్ అమృతమ్మతో కలిసి జీపీ కార్యదర్శి లలిత జేసీబీ సహాయంతో బ్రేక్ కట్టను తొలగించారు. గతంలో ఈ స్పీడ్ బ్రేకర్ వలన ఎన్నో వాహనాలు అదుపుతప్పి.. వాహనదారులు గాయాలపాలయ్యారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. దీంతో నేరుగా పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ స్పందించి స్పీడ్ బ్రేకర్‌ను తొలగించి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చేశారు.

ఆటల్లో గెలుపోటములు సహజం



విజేత జట్లకు బహుమతులు ప్రదానం చేస్తున్న రిథిక్‌రెడ్డి

పూడూరు: క్రీడా స్ఫూర్తితో యువత క్రీడల్లో పాల్గొనాలని కాంగ్రెస్ యువనాయకుడు రిథిక్ రెడ్డి అన్నారు. మంగళవారం పూడూరు మండలం తిర్మలాపూర్‌లో డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య ఆధ్వర్యంలో విలేజ్ ప్రీమియర్‌లీగ్ క్రికెట్ టోర్నీని నిర్వహించారు. ఈ సందర్భంగా రిథిక్‌రెడ్డి మాట్లాడుతూ ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, ఓటమిని గెలుపునకు నాందిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం విజేత జట్లకు మొదటి బహుమతిగా రూ.40 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పరశురాంనాయక్, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్యారోగ్య దినోత్సవం

బంట్వారం: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 14న వికారాబాద్‌లో నిర్వహించే వైద్యారోగ్య దినోత్సవాన్ని విజయవంతం చేయాలని బంట్వారం, కోట్‌పల్లి తహసీల్దార్లు శ్రీనివాస్ రెడ్డి, అష్ఫక్ రసూల్ మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది, పారా మెడికల్, నర్సింగ్ విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్, సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులు కూడా హాజరు కావాలని వెల్లడించారు. వైద్య రంగంలో ప్రభుత్వం సాధించిన ప్రగతిని వైద్యారోగ్య దినోత్సవంలో వివరించాల్సి ఉంటుందని ప్రకటించారు.


నివాళి



నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

ధారూరు: ఎబ్బనూర్ మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి మాతృమూర్తి అంజిలమ్మ దశదినకర్మ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ సునితారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె అంజిలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం రాజేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విజయకుమార్, బీఆర్‌ఎస్ నాయకులు వడ్లనందు, చిగుర్లపల్లి రమేశ్, బస్లరాజ్, రవీందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



బోరు వేయడానికి పూజలు చేస్తున్న నేతలు

కుల్కచర్ల: తాగునీటి ఎద్దడి నివారణకు ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి సహకారంతో నూతన బోరు వేస్తున్నామని నీర్సబ్‌తండా సర్పంచ్ రాజు నాయక్ అన్నారు. మంగళవారం చౌడాపూర్ మండలం మొగుళ్లపల్లిలో నూతనంగా బోరు వేయడానికి పూజ చేసి మాట్లాడారు. పల్లెబాట కార్యక్రమంలో నీటి ఎద్దడి లేకుండా చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని, ఆయన హామీ మేరకే.. బోరు వేయనున్నట్లు సర్పంచ్ తెలిపారు.

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య



బడిబాట ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

- ఉచితంగా పుస్తకాలు, దుస్తుల పంపిణీ
- బడిబాటలో ఉపాధ్యాయులు

కుల్కచర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు.. మౌలిక వసతులు ప్రభుత్వం కల్పిస్తుందని పుట్టపహాడ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలం అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పుట్టపహాడ్‌లో మంగళవారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అత్యుత్తమమైన ప్రతిభగల ఉపాధ్యాయులతో పాఠాలు బోధిస్తున్నామని, కావున చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్పీ రమేష్, స్థానిక ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

పెద్దేముల్: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని ఎంపీటీసీ సభ్యుడు పడగల్ల అంబరయ్య అన్నారు. పెద్దేముల్ మండలం బండమీదిపల్లి, పెద్దేముల్ బాలుర ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. నేటి బాలలే రేపటి పౌరులని, వారిని తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత టీచర్లదేనని చెప్పారు. పాఠశాలల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. విద్యాకమిటీ చైర్మన్ ఎల్లారెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శాంతప్ప, అగ్సర్, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, ఉపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, సంధ్యారాణి పాల్గొన్నారు.

పరిగిలో..



పరిగి: విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

పరిగి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. మల్లెమోనిగూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలను ప్రభుత్వం సమకూర్చుతుందని, మనఊరు–మనబడితో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని చెప్పారు. కావున విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వాసియా తబస్సు, నాయకులు పాష, సూర్యనారాయణ, రాములు, యాదయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

కొడంగల్ రూరల్: 'మీ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి' అని సర్పంచ్ శంకర్‌నాయక్ గ్రామస్తులను కోరారు. కొడంగల్ మండలం పోచమ్మతండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శంకర్‌నాయక్, పాఠశాల హెచ్‌ఎం దినేష్‌సింగ్, ఎస్‌ఎంసీ చైర్మన్ గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

బొంరాస్‌పేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉపాధ్యాయులు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. బొంరాస్‌పేట మండలం బాపల్లి తండా, పూర్యానాయక్‌తండా పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి రెండు జతల దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గోపాల్, రవీందర్‌గౌడ్ మాట్లాడారు. సర్కారు బడుల్లో చదువుకునే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం.. పుస్తకాలతో పాటు దుస్తులు ఉచితంగా పంపిణీ చేస్తోందని చెప్పారు.

కర్షకుల కష్టాలు

- దిగుబడిని తరలించేందుకు అవస్థలు
- రవాణా భారం రెండింతలు

ధారూరు: కర్షకుల కష్టాలు అన్నీఇన్ని కావు. సాగు చేయడం ఒకెత్తు అయితే.. దిగుబడిని విక్రయించి సొమ్ముచేసుకోవడం కత్తిమీద సాములా మారింది. అసలే ధాన్యం కొనుగోలు ప్రక్రియ నెమ్మదించి ఇబ్బంది పడుతున్న రైతులకు.. పంట పొలాల నుంచి కొనుగోలు కేంద్రాలకు దిగుబడిని తరలించినా.. అక్కడ తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు తల్లకిందులుగా తపస్సు చేస్తున్నారు. ధారూరు మండల రుద్రారం గ్రామంలో పొలాల మధ్య ఏర్పాటు చేసిన కేంద్రాల్లో తూకం వేసిన బస్తాలను లారీల్లో మిల్లులకు తరలించాల్సి ఉంటుంది. కానీ.. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోవడం, మట్టిరోడ్డు పూర్తిగా మెత్తబడి భారీ వాహనాలు వస్తే దిగబడుతుండడంతో.. మిల్లులకు తరలించేందుకు పొలాల (కొనుగోలు కేంద్రాల) చెంతకు లారీలు వెళ్లలేని దుస్థితి నెలకొంది. దీంతో కొనుగోలు కేంద్రాల నుంచి బీటీ రోడ్డు వరకు ట్రాక్టర్లలో దిగుబడిని తీసుకువస్తే.. అక్కడ లారీల్లో ఎగుమతి చేసి.. మిల్లులకు తరలించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా చేయడం వలన తమపై రెండు విధాలుగా రవాణా భారం పడుతోందని పలువురు రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తూకం వేసిన వెంటనే ఎప్పటికప్పుడు మిల్లులకు తరలిస్తే ఈ బాధలు ఉండవని రైతులు కోరుతున్నారు.



ట్రాక్టర్ల నుంచి లారీలోకి ధాన్యం బస్తాలను లోడ్ చేస్తున్న రైతులు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

యాలాల: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం యాలాల మండలం విశ్వనాథ్‌పూర్‌లో అంగన్‌వాడీ, డ్వాక్రా భవనాలను ప్రారంభించి మాట్లాడారు. చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అందులో భాగంగానే అన్ని వసతులతో కూడిన అంగన్‌వాడీ నూతన భవనాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చిందని తెలిపారు. గ్రామాల్లో డ్వాక్రా సంఘాల సమావేశాలు, సమీక్షలకు భవనాన్ని అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, సర్పంచ్ సత్యమ్మ, కోఆప్షన్ సభ్యుడు అక్బరబాబా, నాయకులు మెట్లి ఆశన్న, మాధవరెడ్డి, లాలప్ప ముదిరాజ్, అమర్‌నాథ్‌రెడ్డి, అశోక్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. యాలాల మండలం విశ్వనాథ్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలను ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్యా బోధన చేసే ఉపాధ్యాయులు ఉన్నారని, చిన్నారుల తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపకుండా.. పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, సర్పంచ్ సత్యమ్మ, పాఠశాల హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ అశోక్ తదితరులు ఉన్నారు

దారుణివాగుకు వంతెన కావాలి

పెద్దేముల్: ప్రభుత్వాలు, పాలకులు మారినా పెద్దేముల్ మండలం దారుణి వాగుతండా వంతెన సమస్య తీరటం లేదని హన్మాపూర్ ఎంపీటీసీ సభ్యురాలు నీలు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆమె మంగళవారం మాట్లాడారు. మండల సర్వసభ్య సమావేశాల్లో అధికారులు, పాలకులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వంతెన నిర్మిస్తే మండలంతో పాటు తాండూరు ప్రాంత ప్రజలకు లాభం చేకూరుతుందన్నారు.

ముప్పై కిలోమీటర్లు తిరగాలి

వర్షం పడి.. వరద పారితే నెలల పాటు రాకపోకలు నిలిచిపోతాయని, దీంతో గిరిజన ప్రాంత ప్రజలు ఎటు వెళ్లాలన్నా దారి అనుకూలంగా లేదని నీలు తెలిపారు. మండల కేంద్రానికి రావాలన్నా తాండూరు మీదుగా రావలసి ఉంటుందని, వంతెన మంజూరు చేయాలని దశాబ్ద కాలంగా వేడుకుంటున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. వరదల సమయంలో ఇక్కడి ప్రజలు మండల కేంద్రానికి వెళ్లాలంటే.. పది కిలో మీటర్లకు బదులు తాండూరు నుంచి 30 కిల్లో మీటర్లు తిరిగి వెళ్లవలసి ఉంటుందని చెప్పారు. జైరాంతండాకు అనుబంధ గ్రామం దారునివాగుతండా ఉందని, అధికారులు, ప్రజాప్రతినిధులు ఏడాదికి ఒక్కసారి కూడా తండాకు రారని స్థానిక గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెనను మంజూరు చేయాలని ఎంపీపీతో పాటు స్థానికులు కోరుతున్నారు.



వాగు పారడంతో నిలిచిన రాకపోకలు(ఫైల్)

16న మండల సమావేశం

పూడూరు: ఈ నెల 16న ఎంపీపీ మల్లేశం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపీడీఓ ఉమాదేవి తెలిపారు. ఉదయం 11 గంటలకు సమీక్ష ఉంటుందని, మీటింగుకు అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సకాలంలో రావాలని కోరారు.

బీటీరోడ్లు మంజూరు

పూడూరు: మండల పరిధి బాకాపూర్, చింతలపల్లి గ్రామాలకు బీటీరోడ్లు మంజూరయ్యాయని ఎంపీపీ మల్లేశం తెలిపారు. చింతలపల్లి 2కిలో మీటర్ల రోడ్‌కు రూ.కోటి 40 లక్షలు, బాకాపూర్ ఒకటిన్నర కి.మీ రోడ్డుకు రూ.కోటి 5లక్షల నిధులు మంజూరు అయినట్లు చెప్పారు. నెల రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు.

చిరు జల్లులతో పులకరింత

సాగు పనుల్లో అన్నదాతలు బిజీ

- పత్తి పంటలకే మొగ్గు
- విత్తన దుకాణాల్లో రైతుల సందడి



బాలంపేటలో పత్తి విత్తనాలు నాటుతున్న రైతులు

దౌల్తాబాద్: రుతుపవనాలకు ముందే చిరు జల్లులు కురవడంతో రైతన్నలు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. చిన్నపాటి వర్షాలకు కొందరు పత్తి విత్తనాలు విత్తగా.. తగిన మోతాదు వర్షాల కోసం మిగతా రైతులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే దుక్కులు దున్ని సిద్ధంగా ఉంచిన పొలాల్లో సేంద్రీయ ఎరువులు చల్లి సిద్ధంగా ఉంచారు.

12,915 వేల ఎకరాల్లో పత్తి

రైతులు పత్తి సాగుకే ఆసక్తి చూపుతున్నారు. మండలంలో 50,192 ఎకరాల సాగు భూమి ఉండగా.. అందులో అధిక భాగం భూమిలో పత్తి సాగు చేయనున్నారు. కందులు 12,120 ఎకరాలు, వరి 15,099 ఎకరాలు, పెసర్లు 987ఎకరాలు, మిగతా భూమిలో కూరగాయలు, ఇతర పంటలు సాగు చేస్తారని అధికారులు అంచనావేస్తున్నారు.

ఎడతెరిపి లేని వర్షాలతో జాప్యం

సూచనల మేరకే రైతులు విత్తనాల సేకరణ, ఎరువుల కొనుగోలు చేపట్టాలని వ్యవసాయ అధికారుల చెబుతున్నారు. మృగశిర కార్తె నుంచి కురుస్తున్న చిరుజల్లులతో అన్నదాతలు విత్తనాలు నాటేందుకు ఉత్సాహం చూపుతున్నారు. విత్తనాలు నాటేందుకు తగిన మోతాదులో వర్షాలు కురవకున్నా.. ఎడతెరిపి లేని వర్షాలు ప్రారంభమైతే విత్తుకునేందుకు జాప్యం జరుగుతుందని కొందరు రైతులు ఇప్పటికే విత్తనాలు నాటుతుండగా.. అధికారులు తగిన మోతాదులో వర్షాలు కురిసే వరకు వేచి చూడాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా.. నిన్నమొన్న కురిసిన చిరుజల్లులతో మండల కేంద్రంలోని విత్తన దుకాణాల్లో రైతుల సందడి నెలకొంది.

కూలీల కొరత ఏర్పడుతుందని..

మోమిన్‌పేట: నాలుగు రోజుల క్రితం కురిసిన మోస్తరు వర్షంతో రైతులు పత్తి విత్తనాలు విత్తడంలో బిజీ అయ్యారు. మండల రైతుల్లో 50శాతం మంది పత్తి సాగుకు మొగ్గు చూపుతుండగా.. వ్యవసాయ అధికారులు మాత్రం వర్షాలు సమృద్ధిగా కురిసిన తర్వాతే సాగు పనులు మొదలు పెట్టాలని సూచిస్తున్నారు. అయితే అందరూ ఒకేసారి మొదలు పెడితే కూలీల కొరత ఏర్పడుతుందంటూ కొందరు రైతులు సాగు పనుల్లో బిజీ అయ్యారు.

వేచి చూస్తే బాగుంటుంది



మృగశిర కార్తెకు రావాల్సిన వర్షాలు నాలుగైదు రోజులు ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున రైతులు తొందరపడి విత్తనాలు నాటుకోవద్దు. తగిన మోతాదులో వర్షాలు పడ్డాకే విత్తుకోవాలి. చిరుజల్లులతో నాటిన విత్తనం పాడయ్యే ప్రమాదం ఉంది. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి. రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలి.

– లావణ్య, ఏఓ, దౌల్తాబాద్

సంక్షిప్త వార్తలు

• బడ్జెట్ పెంచాలి

అనంతగిరి: ప్రభుత్వం ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ కోరారు. ఈ మేరకు మంగళవారం వికారాబాద్‌లోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ యూనియన్ సీఐటీయూ అనుబంధం సంస్థ ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

• విజయవంతం చేయాలి

పరిగి: ఛలో హైదారాబాద్‌ను విజయవంతం చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్ కోరారు. ఈ మేరకు మంగళవారం పట్టణ కేంద్రంలో 'ఛలో హైదారాబాద్' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 20న ఇందిరపార్క్ వద్ద నిర్వహించే ధర్నాలో గిరిజనులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

• ఎమ్మెల్యే సాక్షిగా మహిళలకు అవమానం!



కుర్చీలు లేక గోడపై కూర్చున్న మహిళలు

పరిగి: ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సాక్షిగా తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో మహిళలకు అవమానం జరిగింది. మంగళవారం పట్టణ కేంద్రంలోని ఎస్‌గార్డెన్‌లో మహిళా దినోత్సవ ఉత్సవాలను నిర్వహించారు. నియోజకవర్గ పరిధి నుంచి మహిళాసంఘాల సభ్యులు, అంగన్‌వాడీ, వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దీంతో వారికి కూర్చునేందుకు కుర్చీలు లేక కొందరు నిలబడగా.. మరి కొందరు నేలపై, ఇంకొందరు గోడలపై కూర్చున్నారు.

• వైద్య శిబిరాలను వినియోగించుకోండి



ఆయుర్వేద మందులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి గాయత్రి

దోమ: పేదలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని, అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవాలని ఆయుర్వేద వైద్యాధికారి గాయత్రి సూచించారు. మంగళవారం దోమ మండలం మైలారంలో ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ రాజునాయక్‌తో కలిసి ప్రారంభించారు. మందులపై అవగాహన కల్పించారు.

• వివాహ వేడుకలో మహిళానేతలు



వధువుకు కానుకలు ఇస్తున్న మహిళా నేతలు

బొంరాస్‌పేట: రేగడిమైలారంలో జరిగిన వివాహ వేడుకల్లో తాండూరు మున్సిపల్ కౌన్సిలర్ నీరజ, బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ శోభారాణి పాల్గొని వధువుకు కానుకలు సమర్పించారు. తాండూరు మున్సిపాలిటీ ఉద్యోగి వెంకటేశ్ కూతురు అంకిత పెళ్లిలో పాల్గొని.. అంకితను పెళ్లి కూతురుగా ముస్తాబు చేశారు. కొత్తబట్టలు సమర్పించి ఆశీర్వదించారు.